ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శనివారం 27 జనవరి 2024

అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



ప్రసంగిస్తున్న కలెక్టర్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్

- 'మహాలక్ష్మి'తో ఆర్టీసీ బస్సుల్లో 7,80,682 మందికి ఉచిత ప్రయాణం
- రాజీవ్ ఆరోగ్యశ్రీలో రూ.10 లక్షలకు వైద్య సేవల పెంపు
- పదవ తరగతిలో వంద శాతం ఫలితాలకు కృషి
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళలు సమాజ అభివృద్ధిలో మరింత భాగస్వాములు అవుతున్నారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచిత వైద్య సదుపాయాన్ని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచిందన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జాతిపిత మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, అబుల్‌కలాం ఆజాద్, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి ఎందరో మహనీయుల పోరాట ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చి గణతంత్ర దేశంగా రూపుదిద్దుకుందన్నారు. జిల్లాలో గత నెలలో అసెంబ్లీ ఎన్నికలు, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకున్నామన్నారు. ఇందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా మహిళందరికీ రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం కల్పించిందన్నారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 7,80,682 మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నారు. ఈ పథకం వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేట్ 90 శాతానికి పెరిగిందన్నారు. మహిళలకు, ఆర్టీసీకి ఈ పథకం లాభాదాయకంగా మారిందని, విద్య, ఉపాధి రంగాల్లో ఉన్నటువంటి వాళ్లు అధికంగా లబ్ధి పొందుతున్నారని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నదని, 5 లక్షల నుంచి 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నారని అన్నారు. తద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 1399 మంది ఉచిత వైద్యం పొందారని పేర్కొన్నారు. అభయ హస్తం ప్రజాపాలన గ్రామ, వార్డుసభలను డిసెంబరు 28 నుంచి జనవరి 6వ వరకు నిర్వహించామన్నారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇళ్ల వంటి ఐదు గ్యారెంటీ పథకాల కోసం 2,40,371 మంది దరఖాస్తు చేసుకున్నారని, వాటన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌తో పాటు కార్పొరేషన్‌లో నిర్వహిస్తున్నామని, 405 దరఖాస్తులు రాగా, 90 శాతం పరిష్కరించామన్నారు.



ఓపెన్‌టాప్ జీప్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

భూ సమస్యల పరిష్కారానికి కృషి..

జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైతులను ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్ల తోటల వైపు తీసుకవెళ్లేందుకు రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. గడిచిన వానాకాలం సీజన్‌లో జిల్లాలో 307 ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి 415 కోట్లకు పైగా విలువ చేసే 1,88,918 టన్నుల ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేశామని, కేవలం 48 గంటల్లో రైతు ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. స్థానిక సంస్కృతి సంప్రదాయాలు, జిల్లా చరిత్ర ప్రతిబింబించే విధంగా కలెక్టర్ కార్యాలయంలో మ్యూజియంను ఏర్పాటు చేశామని, కలెక్టరేట్ ద్వారాన్ని రూపుదిద్దామన్నారు. జిల్లాలో యువత డ్రగ్స్, గంజాయి వంటి మారక ద్రవ్యాలకు అలవాటు గాకుండా ఉండేందుకు, డ్రగ్స్ నియంత్రణ కోసం పోలీసుల సహకారంతో చర్యలు చేపట్టామని, వివిధ శాఖల ద్వారా నిఘా పెట్టామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రతి బుధవారం 'లంచ్ అండ్ లెర్న్' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జిల్లా అధికారులు ఆ రోజున ఒక ప్రభుత్వ పాఠశాల, గురుకుల విద్యాలయం, సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలో 8 వారాలుగా జరుగుతున్నదన్నారు. పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో వందకు వంద శాతం ఫలితాలను సాధించేందుకు ప్రత్యేక దృష్టిని సారించామన్నారు. ప్రతి రెండు పాఠశాలలను జిల్లా స్థాయి అధికారి దత్తత తీసుకుని విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు. వేక్ అప్ కాల్స్‌తో నిద్ర లేపి చదువుకునేలా చేస్తున్నామని, ప్రత్యేక తరగతుల నిర్వహణతో పాటు ఏ,బీ,సీ కేటగిరీలుగా విద్యార్థులను విభజించి చదువులో ముందుండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

పర్యాటకంగా అభివృద్ధికి ప్రణాళికలు

పెద్దపల్లి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవసరైన ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. 'మన పెద్దపల్లి' అనే కార్యక్రమంతో జిల్లాలో ఉన్న ఐతిహాసిక ప్రాంతాలను గుర్తించి వాటి చరిత్ర, సంస్కృతి ప్రజలకు తెలిసేలా దృష్టి సారించామన్నారు. 400 ఏళ్ల చరిత్ర గల రామగిరి ఖిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితరులకు ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ శాఖల ద్వారా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందించారు. అలాగే స్వతంత్ర సమరయోధులు ఎర్రబెల్లి రంగారావు, కాచె కమలాదేవిలను సన్మానించారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా జడ్జి హేమంత్ కుమార్, అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, డీసీపీ డాక్టర్ చేతన, ఏసీపీలు ఎడ్ల మహేష్, తులా శ్రీనివాసరావు, ఆర్‌డీవోలు సీహెచ్ మధుమోహన్, హనుమా నాయక్, రామగుండం కార్పొరేషన్ మేయర్ డాక్టర్ అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 19.25 లక్షల రుణాల పంపిణీ..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా మహిళా సంఘాలకు 19 కోట్ల 25 లక్షల రుణాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పంపిణీ చేశారు. 181 స్వశక్తి సంఘాలకు 14 కోట్ల 47 లక్షల, 54 వేలు, మెప్మా ద్వారా 63 స్వశక్తి సంఘా లకు 4 కోట్ల 78 లక్షల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేశారు. అనంతరం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ, పోషణ్ అభియాన్‌పై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ సందర్శించారు.



స్వశక్తి సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాల చెక్కు అందజేస్తున్న కలెక్టర్

సంఘ విద్రోహ శక్తులను నియంత్రించినప్పుడే ప్రశాంతత

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి

కోల్‌సిటీ, జనవరి 26: సంఘ విద్రోహ శక్తులను, నేరస్థులను, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని నియంత్రించినప్పుడే సమాజంలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు జీవిస్తారని రామగుండం పోలీస్ కమిషనర్ రెమారాజేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను కమిషరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆమె పోలీస్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. పోలీస్ విధులు సమర్థవంతంగా నిబద్ధతతో ధైర్యంగా నిర్వహించాలని, ప్రజల ఆదరాభిమానాలు పొందాలని సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో కష్టపడి పనిచేస్తారని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉందని, భవిష్యత్‌లో కూడా ఇదే విధానాన్ని కొనసాగించాలన్నారు. వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ క్రమశిక్షణతో పని చేయాలన్నారు. తాను ఎలాంటి క్లిష్టపరిస్థితులైనా ఎదుర్కొంటానని, సంఘ విద్రోహ శక్తులను అదుపు చేస్తూ ప్రజలకు నిజాయితీగా సేవలందిస్తానని ప్రతిజ్ఞ బూనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీసీపీ రియాజ్ ఉల్ హక్, గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు, ఏఓ నాగమణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఎగురవేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని కోర్టుల్లో..

గోదావరిఖని కోర్టుల్లో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు న్యాయస్థానంలో న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గోదావరిఖని మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్‌లో జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

రామగుండం అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి..

- మేయర్ బంగి అనీల్ కుమార్

కోల్‌సిటీ, జనవరి 26: రామగుండం నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కృషి చేస్తున్నారని రామగుండం మేయర్ బంగి అనీల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ముందు కమిషనర్ నాగేశ్వర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మేయర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ రామగుండంలో అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారన్నారు. వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లో రూ.40కోట్లతో అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారావు, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఆర్ఓ రాయలింగు, ఈఈ సుచరణ్, కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



జెండావిష్కరణ చేస్తున్న కమిషనర్ నాగేశ్వర్‌రావు

దేశ ఆర్థికాభివృద్ధిలో ఎన్‌టీపీసీది కీలకపాత్ర

- ఈడీ కేదార్ రంజన్‌పాండు

జ్యోతినగర్, జనవరి 26: దేశ ఆర్థికాభివృద్ధిలో ఎన్‌టీపీసీది కీలకపాత్ర అని ఎన్‌టీపీసీ రామగుండం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు అన్నారు. శుక్రవారం మహాత్మాగాంధీ స్టేడియంలో జరిగిన రిపబ్లిక్‌డే వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఉత్తమ ఉద్యోగులు, అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన ప్రసంగించారు. దేశ ప్రజల అవసరాలు, పరిశ్రమలు, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేస్తూ దేశ పురోభివృద్ధిలో ఎన్‌టీపీసీ ఉద్యోగుల కృషి ఎనలేనిదని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ అవసరాలను ఎన్‌టీపీసీ తీరుస్తున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు 800 మెగావాట్ల రెండవ యూనిట్‌ను త్వరలో ప్రారంభించనున్నామని, ఈనెల 28న ట్రయల్ రన్ నిర్వహించనున్నట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు పేర్కొన్నారు. మొదటి యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నదని, రెండవ యూనిట్ ప్రారంభంతో ప్లాంట్ సామర్థ్యం మరింత పెరగనున్నట్టు ఆయన తెలిపారు. ఉద్యోగుల కృషి ఫలితంగా ఎన్‌టీపీసీ సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఈడీ

ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉత్పత్తిలో సగం యూరియా తెలంగాణకే..

- ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్



జెండా వందనం చేస్తున్న సీఈఓ అలోక్ సింఘాల్

కోల్‌సిటీ, జనవరి 26: ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉత్పత్తిలో సగం యూరియా తెలంగాణ రాష్ట్రానికే అందుతుందని ప్రాజెక్టు సీఈఓ అలోక్ సింఘాల్ అన్నారు. శుక్రవారం ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రాంగణంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సెక్యూరిటీ సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించారు. పతాకావిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా యాజమాన్యం పని చేస్తుందన్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాలో సగం తెలంగాణకు, మిగతా సగం దేశంలోని ఇతర రాష్ట్రాలకు అందిస్తున్నామన్నారు. తెలంగాణలో యూరియా కొరత తీర్చడం ద్వారా వ్యవసాయ అభివృద్ధికి పాటుపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సీజీఎం ఎస్‌కే ఝా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరవలేనివి..

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, జనవరి 26: మహనీయుల త్యాగాలు మరువలేనివని, యువత మహనీయులను ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ముందుకు సాగాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం రావగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా విష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం ముందుకు సాగాలని, కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రభుత్వాన్ని ఇప్పుడిప్పుడే పునఃనిర్మించుకుంటున్నామని, గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని, ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా చేరే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ఎండీ ముస్తాఫా, కొలిపాక సుజాత, నాయకులు దాసరి సాంబమూర్తి, దాసరి ఉమాదేవి, పాతిపెల్లి ఎల్లయ్య, యుగంధర్, గట్ల రమేష్, పీక అరుణ్ పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం ఎమ్మెల్యేకు సన్మానం

పాలకుర్తి,జనవరి 26: మండలంలోని కుక్కలగూడూర్,వేమునూర్ గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన ఆత్మీయ అభినందన, సన్మాన కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌ను సన్మానించారు. మేడం బాపు,బోరె లక్ష్మణ్, ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, గంగాధరి రమేష్ గౌడ్, బయ్యపు మనోహర్‌రెడ్డి, సూర సమ్మయ్య, ఉరిమెట్ల రాజలింగయ్య పాల్గొన్నారు.





పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌టౌన్, జనవరి 26: న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యం, కూడలి రాంప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని జ్యోతినగర్ పార్కులో జాతీయ జెండాను వారు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ ఏజెంట్‌కు ఎలక్ట్రికల్ బైక్ సబ్సిడీలో ప్రభుత్వం అందించాలన్నారు. ఇన్సూరెన్స్, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని కోరారు. మహారాష్ట్రలో ఉన్న పథకాలను ఇక్కడ అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కోశాధికారి ఉప్పు రాజేందర్, పెద్దిలక్ష్మీనారాయణ, పచ్చునూరి రాజేందర్, సాయికృష్ణ, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

రేపు ఉదయ సాహితి ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ లీగల్, జనవరి 26: ఉదయ సాహితి సంస్థ ఆవిర్భావ దినోత్సవం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఈనెల 28న ఆదివారం నిర్వహిస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ఎర్రం రాజారెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కవితల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఇందులో ప్రథమ బహుమతి హైదరాబాద్‌కు చెందిన నాంపల్లి సుజాత, ద్వితీయ బహుమతులు మంచిర్యాలకు చెందిన రాజేశ్వరరావు, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మాడురి అనిత చరణ్, తృతీయ బహుమతులు కరిమల జిల్లా చెందిన అశోక్, మచ్చ విజేందర్, నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన అరుణ్ కుమార్‌కు వచ్చాయన్నారు.







కేంద్ర ప్రభుత్వ విధానాలు సరికాదు

• రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి

గణేశ్‌నగర్, జనవరి 26: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సరికాదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎస్‌కేఎం పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి గీతభవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ణ వెంకటరెడ్డి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కేంద్రం విధానాలు కార్పొరేటు, మతోన్మాద శక్తులకు ఊతం ఇచ్చే విధంగా ఉన్నాయని తెలిపారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించారని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలను అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తోందని విమర్శించారు. రైతులకు ఇబ్బందులు కలిగించే మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నామని చెప్పిన కేంద్రం మళ్లీ వాటిని అమలు చేసేందుకు యత్నిస్తోందని చెప్పారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా గత యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను తగ్గించిన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తయినా కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. మరోవైపు నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచుతూ పేదలపై భారం మోపుతుందన్నారు. ఒకవైపు కార్మిక , రైతు , ప్రజా వ్యతిరేకవిధానాలను దూకుడుగా అవలంబిస్తూ మరోవైపు ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ప్రజల మధ్య కులాలు , మతాల పేరుతో చిచ్చు పెడుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే దేశంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ఇబ్బందులను పక్కదారి పట్టిస్తూ రాజకీయ లబ్ధి కోసం ఇంకా పూర్తిగా నిర్మాణం కానీ అయోధ్య రామ మందిర ప్రతిష్ట పేరుతో ముందుకు వస్తుం దన్నారు. కేంద్ర విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్య చేసి వచ్చే పార్లమెంటు ఎన్నికలలో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. అన్ని సంఘాలు ఐక్యంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొనగంటి కేదారి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కవ్వంపల్లి అజయ్, వడ్ల రాజు, కేపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు యు శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి ఫున్నం రవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదవ్ టేకుమల్ల సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సృజన కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ చేపడుతున్న కార్మిక సంఘాల నాయకులు

తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో సంబరాలు


స్వీట్లు పంచుతున్న నాయకులు

గణేశ్‌నగర్,జనవరి 26: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో టపాసులు పేల్చి సీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జేఏసీ, జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు మాట్లాడారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత ఉద్యమకారులకు సరైన గౌరవం గత సర్కార్ ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుత ప్రజా సర్కార్ ఉద్యమకారులను గుర్తించి కోదండరాంకు ఎమ్మెల్సీ బాధ్యతలు ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, మాజీ కన్వీనర్ బండి చంద్రశేఖర్, తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు వెంకట మల్లయ్య, తెలంగాణ జేఏసీ కోఆర్డినేటర్, కో చైర్మన్ పెంచాల శ్రీనివాస్, మాడుగుల రాములు ,అధికార ప్రతినిధులు ఆంజనేయరావు, మహమ్మద్ ఫయాజ్, అలీ, మార్వాడి సుదర్శన్, నాయకులు ఎస్టీయు జిల్లా అధ్యక్షులు పిఆర్ శ్రీనివాస్ కుమారస్వామి , తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ నాగేందర్ సింగ్,కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

మానకొండూర్, జనవరి 26: మానకొండూర్ మండలంలోని బోరగుట్ట సమీపంలో వద్ద శుక్రవారం రాత్రి విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టింది. హనుమకొండకు చెందిన శ్రీపాల్‌రెడ్డి అనే వ్యక్తి కుమరం భీం జిల్లా సిర్పూర్-కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధులు ముగించుకొని మంచిర్యాల నుంచి హనుమకొండకు కారులో వెళుతుండగా మార్గమధ్యలో ముందుటైరు పేలింది. దీంతో కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైంది. కాగా శ్రీపాల్‌రెడ్డి సురక్షితంగా బయటపడ్డారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వృద్ధులు మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 26 : కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్, నగునూర్‌లలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వృద్ధులు మరణించారని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదాల్లో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన బావు ఎల్లయ్య(72), ఆలకుంట సాయిలు(68)లు తీవ్రగాయాలతో ప్రమాదస్థలంలోనే దుర్మరణం చెందారు. సింగరేణిలో పనిచేసి పదవీవిరమణ పొందిన బావు ఎల్లయ్య, అతని బార్య టీవీఎస్ ఎక్సెల్‌పై గురువారం కొలనూరు నుంచి కరీంనగర్ శివారులోని కృష్ణనగర్‌లో తన కొడుకు బావు తిరుపతి ఇంటికి వచ్చా రు. శుక్రవారం తిరిగి కొలనూరుకు ద్విచక్రవాహనంపై ఇద్దరు వెళుతుండగా కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ కెనాల్ వద్ద రాజీవ్‌రహదారిపై వెనుక నుంచి సిమెంట్ కంటైనర్ ఢీకొట్టి ఎల్లయ్యపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీ సులు తెలిపారు. మృతుడి కొడుకు తిరుపతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. అలాగే కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌కు చెందిన ఒడ్డెర కూలీ అయిన ఆలకుంట సాయిలు శుక్రవారం ఉదయం టీ తాగేందుకు ప్రతిమ ఆసుపత్రి వద్దకు వెళుతుండగా జూబ్లీనగర్ క్రాస్‌రోడ్ వద్ద వెనుక నుంచి ఐషర్ వ్యాన్ ఢీకొట్టగా రెండు కాళ్లకు, పొట్టభాగంలో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కొండచిలువ


చనిపోయిన కొండచిలువ

ఎల్లారెడ్డిపేట, జనవరి 26: ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి శుక్రవారం కొండచిలువ ప్రత్యక్షమైంది. విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న భజరంగ్ యువజన సంఘం సభ్యులు చేరుకుని కొండచిలువను హతమార్చారు. దాంతో ఊపిరి పీల్చుకున్నారు. ధైర్యంతో కొండచిలువను చంపేసిన యువకులను స్థానికులు అభినందించారు. పాఠశాల ఆవరణలో నర్సరీ కొనసాగుతుండడం వల్ల పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయని సభ్యులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. నెల రోజుల కిందట పాఠశాల తరగతి గది కిటికి వద్దకు రెండు మీటర్ల పొడవు ఉన్న పాము వచ్చిందని తెలిపారు. తరుచు పాములు వస్తుండడంతో విద్యార్థులు భయంతో బిక్కుబిక్కుమంటు పాఠాలు వినాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు , ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాల ఆవరణలో ఉన్న నర్సరీని వేరే ప్రాంతానికి తరలించి విద్యార్థులకు విష ప్రాణుల నుంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి మైలారం మల్లికార్జునస్వామి జాతర


మైలారంలోని మల్లికార్జున స్వామి ఆలయం

గన్నేరువరం, జనవరి 26: మండలంలోని మైలారం గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జాతర మహోత్సవాలను నిర్వహించ నున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ వరాల పర్శరాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి స్వామివారి పల్లకి సేవ, ఒగ్గు కళాకారులచే ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఆదివారం పెద్ద పట్నాలు, స్వామివారి కల్యాణం, అభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.



డెంగీతో వార్డు సభ్యురాలి మృతి


సరిత(ఫైల్)

మానకొండూర్, జనవరి 26: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలు అమ్మిగల్ల సరిత (34) డెంగీ వ్యాధితో గురువారం రాత్రి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సరిత గ్రామంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో కొంత కాలంగా వంట చేస్తోంది. వారం రోజుల క్రితం తీవ్రమైన జ్వరం రావడంతో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జ్వరం తగ్గక పోవడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. నెల రోజుల క్రితం మృతురాలి అత్తమ్మ మల్లమ్మ అనారోగ్యంతో మరణించింది. ఒకే ఇంటిలో ఇద్దరు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. సరితకు భర్త, ఇద్దరు కుమార్తెలు, 14నెలల కుమారుడు ఉన్నారు.

కోడి కోసమని వెళ్లి.. కనిపించకుండా పోయిన భక్తుడు


పెద్ద శ్రీనివాస్, దోర్నాల సమ్మయ్య

వేములవాడ, జనవరి 26: బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం ముందు కోయడానికి కోడి తీసుకువస్తానంటూ వెళ్లిన ఓ భక్తుడు కనిపించకుండా పోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తున్న తరుణంలో కొద్ది వారాలుగా వేములవాడకు భక్తులు పోటెత్తు తున్నారు. ఈ క్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పెద్ద శ్రీనివాస్ (45) సరిత దంప తులు కుటుంబ సమేతంగా ఈనెల 21వ తేదీన వేములవాడకు వచ్చారు. రాజన్నను దర్శించుకొని 22వ తేదీన బద్దిపోచమ్మ ఆలయం వద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకునేందుకు సిద్ధమయ్యారు. అమ్మవారి మొక్కు కోసం కోడిని తీసుకు వస్తానని వెళ్లిన శ్రీనివాస్ కనిపించకుండా పోయాడు. దీంతో భార్య సరిత శుక్రవా రం వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త 5.6 ఫీట్ల ఎత్తు, బక్క పల్చగా కోలముఖం, తెలుపు రంగులో ఉంటాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఇదే జిల్లాలోని జంగిడి గ్రామానికి చెందిన దోర్నాల సమ్మయ్య అనే 45 సంవత్సరాల వయస్సు ఉన్న అతను రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో ఈనెల 22న అదృశ్యమయ్యాడని అతడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు కేసులను దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

ఎనిమిది మంది జీవిత ఖైదీల విడుదలకు సిద్ధం

కరీంనగర్ క్రైం, జనవరి 26: వివిధ నేరాల్లో జైలుశిక్ష అనుభవిస్తున్న సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవితఖైదు అనుభవిస్తూ, అనారోగ్యం, వృద్ధాప్యం, ఇతర సమస్యలతో బాధపడుతున్న ఖైదీల శిక్ష కాలాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 231 మంది ఖైదీలను ప్రభుత్వం జైలు నుంచి విడుదల చేయనుండగా కరీంనగర్ జిల్లా జైలు నుంచి ఎనిమిది మంది జీవిత ఖైదీలు విడుదల కానున్నారు. 10 సంవత్సరాల శిక్షాకాలం పూర్తి అవటంతోపాటు నాలుగు సంవత్సరాల రెమిటేషన్ కలిగిన ఖైదీలు విడుదలకు అర్హులు. ఈ అర్హత కింద జిల్లా జైలులో ఎనిమిది మంది ఖైదీలు శనివారం విడుదల కానున్నారు. విడుదల కానున్న ఏడుగురు జీవితఖైదీల్లో ప్రస్తుతం ఏడుగురు ఖైదీలు ఓపెన్ జైలు పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తుండగా మరొక ఖైదీ వృద్ధాప్యంతో జైలులోనే ఉంటున్నాడు. విడుదల జాబితా సిద్ధమైనప్పటికీ ప్రభుత్వ ఉత్తర్వులు ఇంకా అందకపోవటం, జైలు సమయం కూడా ముగియటంతో శుక్రవారం విడుదల కాలేకపోయారు.

సుల్తానాబాద్ స్వప్న కాలనీలో చోరీ

సుల్తానాబాద్, జనవరి 26: సుల్తానాబాద్ పట్టణంలోని స్వప్న కాలనీలో గురువారం రాత్రి శివరాత్రి శోభారాణి ఇంట్లో దొంగతనం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం బీరువాలో దాచిపెట్టిన బంగారం, నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఇంట్లో సీసీ కెమెరాలు ఉన్నా ఆధారాలు దొరకకుండా ఉండేందుకు హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏసీపీ ఎడ్ల మహేష్ ఆధ్వర్యంలో సీఐ జగదీష్, ఎస్ఐ విజేందర్‌లు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలతో శుక్రవారం దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. శోభారాణి కుమారుడు రఘు సింగపూర్‌కు వెళ్లాడని, అతను వస్తే బంగారం, నగదు ఎంత పోయాయో వివరాలు తెలుస్తాయని శోభారాణి పోలీసులకు తెలిపారు.

ఉపకాలువలో మృతదేహం లభ్యం

ఎలిగేడు, జనవరి 26 : మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి, ముప్పిరితోట గ్రామ శివారులోని డి-86 ఉపకాలువలో 50-55 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. గుండ్రని మొఖం, బ్లూ కలర్ నిక్కర్ ధరించి ఉన్నాడని ఈ వ్యక్తి సంబందించి వివరాలు జూలపల్లి ఎస్సై ఫోన్ నంబర్ 8712656513కి తెలియజేయాలని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


భైర శేఖర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జనవరి 26: కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భైర శేఖర్(22) అనే యువకుడు మృతి చెందాడు. కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి ధర్మారం మండలం చామనపల్లికి చెందిన శేఖర్ కొంత కాలంగా కరీంనగర్‌లోని విద్యానగర్‌లో నివాసం ఉంటూ ఇక్కడే కూలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు.. శేఖర్ మరో ఇద్దరు స్నేహితులు కలిసి మూడు ద్విచక్రవాహనాలపై ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో జెండా ఎగురవేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పనికి వెళుతుండగా ఐటీ టవర్ మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన శేఖర్‌కు తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత


నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, జనవరి 26: కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం రేకుర్తి షేక్‌ఖాన్‌నగర్‌లో జరిపిన దాడుల్లో 703 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడింది. గంజాయితో దొరికిన సమీర్‌బేగ్, షేక్ రిజ్వాన్, రహీం చావూస్‌లపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసీం, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

వేములవాడ టౌన్, జనవరి 26: తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు గీతకార్మికుడు జారి పడిన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి 13వ వార్డులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గడ్డమీది లస్మయ్య అనే వ్యక్తి తమ వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. దీంతో లస్మయ్యకు తీవ్రగాయాలు కాగా పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు కౌన్సిలర్ గడ్డమీది లావణ్య శ్రీనివాస్ తెలిపారు.

ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ అమలుచేయాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

భగత్‌నగర్, జనవరి 26: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ అమలుచేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కరీంనగర్ జిల్లా శాఖ రూపొందించిన నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల జీవితాలను చిన్నాభిన్నం చేసిన 317 జీవోను సవరిస్తారా లేదా స్పష్టం చేయాలన్నారు. పాఠశాలల్లో స్కావెంజర్లులేక ప్రభుత్వ పాఠశాలలు దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. ఉద్యోగులకు డీఏలు చెల్లించడంతో పాటు కొత్త పీఆర్సీ నివేదిక తెప్పించుకుని వెంటనే అమలుచేయాలన్నారు. దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. పునర్ వైభవం, పునర్‌నిర్మాణం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం అహర్నిషలు కృషిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, సరెండర్‌లీవులు, జీపీఎఫ్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేదని, రైతు బంధు నిధులు ఆపి ఈ నెల ఉద్యోగులకు జీతాలు చెల్లించిందని వివరించారు. పార్లమెంట్ ఎన్ని కల తర్వాత ఉద్యోగులకు డీఏ, పీఆర్సీ సంగతి అటుంచితే నెలాఖరుకు కూడా జీతాలిచ్చే పరిస్థితి ఉండబోదన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు రావాలన్నా, రాష్ట్రాని కి కేంద్రం నిధులు ఇవ్వాలన్నా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక ఎంపీ స్థానాల్లో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తపస్ అధ్యక్ష, కార్య దర్శులు కట్టా రాజేశం, అన్నమనేని తిరుపతిరావు, అంబటి వెంకన్న, వెంకటరమణారావు, శ్రీనివాస్, సుధాకర్, రామస్వామి, కృష్ణ, గోపాల్, ఉదయ్‌కిరణ్ రావు నర్సింహారెడ్డి, ప్రభాకర్, శశిధర్‌రెడ్డి, వాసు, వి రాధిక పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, జనవరి 26: దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం నాడు భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. బాలాత్రిపురాసుందరీదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజ. కళాభవన్‌లో స్వామివారి నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో లఘు దర్శనం అమలు చేశారు. దీంతో భక్తులు నందీశ్వరుడి విగ్రహం వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపిస్తున్న తరుణంలో గత కొద్ది వారాలుగా ప్రతినిత్యం వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నాడు సుమారు 50 వేలకు పైగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడిపోయింది. కోడె ముక్కుల చెల్లింపు కోసం భక్తులకు కనీసం నాలుగు నుండి ఐదు గంటలకు పైగా సమయం పట్టింది. స్వామివారి సర్వ దర్శనం కోసం నాలుగు గంటల సమయం అవసరమైంది. వసతి గదులు దొరకకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ప్రైవేటు అద్దె గదుల యజమానులు గదుల అద్దెను రెండు నుంచి మూడింతలు పెంచి ఇష్టారాజ్యంగా భక్తులను దోచుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

శివదీక్షలు ప్రారంభం

వేములవాడ, జనవరి 26: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవ స్థానంలో శుక్రవారం శివదీక్షలు ప్రారంభమయ్యాయి. ఆలయంలోని అభిషేక మండపంలో ఆలయ అర్చకులు దాదాపు 300 మంది భక్తులు శివదీక్ష స్వీకరించారు. నుదుటన విభూతి, కుంకుమ ధరించిన శివ స్వాములకు అర్చకులు రుద్రాక్ష శివ మాల ధారణ గావించారు. ప్రతియేటా శివరాత్రి ముందు శివుడి మాలధారణ చేసి, శివరాత్రి నాడు లింగోద్భవ సమయంలో మాల విరమణ చేయడం రాజన్న క్షేత్రంలో ఆనవాయితీగా వస్తోంది. స్వీకరించిన స్వాముల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. గురుస్వాములు వాసాలమర్రి గోపి, తమ్మల సంతోష్, జంగేటి సంజీవ్, మచ్చ కిషన్, రాపల్లి శ్రీధర్, మ్యాన శ్రీనివాస్ పాల్గొన్నారు.


శివ దీక్ష స్వీకరిస్తున్న భక్తులు

పశు వైద్యాధికారులకు ముగిసిన శిక్షణ

సుభాష్‌నగర్, జనవరి 26: పాడి పశువుల పునరుత్పత్తిలో మెళకువలకు సంబంధించిన పశు వైద్యాధికారులు శిక్షణ ముగిసినట్లు శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ లింగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమంలో ఆరు రోజులు తరగతి గదిలో మూడు రోజులపాటు తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి, సాయిబుపల్లి, రామడుగు మండలంలోని రంగసాయిపల్లి, దత్తోజీపేట, సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల, కదంబపూర్, గ్రామాల్లో ఉచిత గర్భకోశ నివారణా శిబిరాలను నిర్వహించి, వైద్యుల నైపుణ్యాన్ని ప్రత్యక్షంగా పెంపొందించారు. కార్యక్రమంలో డాక్టర్ జీవికె శర్మ, డాక్టర్ శర్మ, డాక్టర్ ఎస్‌పీ రెడ్డి, డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ ఎం కోటేశ్వర్‌రావు, డాక్టర్ సాయిచైతన్య, డాక్టర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

కళారంగంపై వివక్ష సరికాదు

- వృత్తి కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు కృపాదానం

కరీంనగర్ కల్చరల్, జనవరి 26: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంసాపత్రాల ప్రదానంలో భాగంగా జిల్లా యంత్రాంగం వివక్ష చూపిందని, సాంస్కృతిక, సాహితీ, క్రీడా రంగాలకు చెందిన వ్యక్తులను విస్మరించడం సరికాదని రాష్ట్ర జానపద వృత్తి కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు జి కృపాదానం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు అవార్డులిస్తుంటే ప్రత్యేక మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉన్న ఈ శాఖకు సంబంధించిన ఒక్కరికి కూడా వేడుకల్లో ప్రశంసాపత్రం ఇవ్వక పోవడంపై కళాకారులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి నకవులు, కళాకారులు, క్రీడాకారులను ఇకనైనా గుర్తించాలని తెలిపారు. గడ్డం సమ్మయ్య, కొండప్పలకు పద్మశ్రీ రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారిని గుర్తించడం అభినందనీయమని తెలిపారు.

కేశవులు సేవలు చిరస్మరణీయం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్


నాన్నకు ప్రణతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విప్, ఎమ్మెల్యే అడ్లూరి

ధర్మపురి, జనవరి 26: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి, మంత్రిగా ప్రజలకు అందించిన కేవీ కేశవులు సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, దివంగత కేవీ కేశవులు శత జయంతి సందర్భంగా కూతురు డాక్టర్ కేవీ ప్రణతి రచించిన నాన్నకు ప్రణతి అనే పుస్తకాన్ని శుక్రవారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ కేశవులు గొప్ప మహనీయుడని ఆయన కొనియాడారు. ఇక్కడే పుట్టి పక్క జిల్లాలో ఎమ్మెల్యేగా గెలిచి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేనేత జౌళి శాఖ మంత్రిగా పని చేసి ఈ ప్రాంతాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మీ నాట్యమండలి అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కేవీ కేశవులు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేవీ మురళీధర్, ప్రధాన కార్యదర్శి రోహిత్, రిటైర్డ్ జడ్జి కె. రాజన్న, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, శ్రీ లక్ష్మీ నరసింహ నాట్యమండలి కార్యదర్శి కొరిడె నరహరి తదితరులు పాల్గొన్నారు.

●కర్నె అక్కపెల్లి కళ్యాణ మండపంలో కేవీ కేశవులు శత జయంతి సంద ర్భంగా స్థానిక కళాకారులచే శుక్రవారం నిర్వహించబడిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. లక్ష్మీ నరసింహ నాట్యమండలి కార్యదర్శి, ప్రముఖ సంగీత విద్వాంసులు కొరిడె నరహరి, ప్రముఖ గాయకులు గుండి శంకర్‌శర్మ, పాలెపు చంద్రమౌళి, పాడిన శాస్త్రీయ సంగీతం శ్రోతలను అలరించాయి.

● చివరి ఆయకట్టు వరకు సాగునీరు

గొల్లపల్లి: ధర్మపురి నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీ టిని అందిస్తామని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందడం లేదని, కాలువలో పూడికతీత పేరుకుపోయిందని పలువురు లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లడంతో రాఘవపట్నం గ్రామంలోని కాకతీయ డి-64 కెనాల్‌ను శుక్రవారం లక్ష్మణ్ కుమార్ మండల నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. పలు చోట్ల తూముల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయిన దిగువ ప్రాంతాలకు అడ్డుగా నిలువడంతో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు, గొల్లపల్లి సర్పంచ్ ముస్కు నిశాంత్ రెడ్డి తన సొంత ఖర్చులు వెచ్చించి జేసీబీతో తూముల వద్ద చెత్తను తీసివేయించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధర్మపురి తలాపున గోదావరి నది ఉన్నా ఇక్కడి రైతాంగానికి సాగునీరు అందని పరిస్థితి ఉండేదని, కెనాల్స్ ద్వారా నీరందించే సౌకర్యం ఉన్నప్పటికీ గత ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు అందలేదన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎంను కలిసి వివరించామన్నారు. సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, శ్రీరాములపల్లె ఎంపీటీసీ లంబ ధనవ్వలక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

ఐదుగురు అంతర్ జిల్లా దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

గంభీరావుపేట, జనవరి 26: వరుస దొంగతానాలకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్ట్ చేశామని, వారి నుంచి రూ. 40 వేల నగదుతోపాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నిందితులైన కామారెడ్డి జిల్లా నారాయణపూర్‌కు చెందిన పూడెం అరుణ్‌కుమార్, ఆర్మూర్‌కు చెందిన బోడమీది రవి, గాంధారికి చెందిన గాయిని మైసయ్య, గులుసు లింగం, కామారెడ్డికి చెందిన కలీం అహ్మద్‌ను పెద్దమ్మ స్టేజీ వద్ద పట్టుకున్నట్టు సీఐ తెలిపారు. నిందితులు మండల పరిధిలోని ముస్తాఫనగర్, దమ్మన్నపేట గ్రామాల్లో ఉన్న ఐడియా, బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌లలోని బ్యాటరీలను గతేడాది డిసెంబరు 16న దొంగలించారని పేర్కొన్నారు. నారాయణపూర్‌కు చెందిన అరుణ్‌కుమార్ గతంలో బీఎస్ఎన్ఎల్ కంపెనీలో సూపర్ వైజర్‌గా పనిచేశారన్నారు. అరుణ్‌కుమార్ మిగతా నిందితులను కలుపుకుని ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడేవాడని తెలిపారు. దోచుకున్న వస్తువులను కామారెడ్డిలోని కలీం అహ్మద్ అమ్మేవారని వెల్లడించారు. ఐడియా, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది ఫిర్యాదుతో దొంగతనాలకు పాల్పడ్డ వారికి కోసం ఇటీవల గాలింపు మొదలు పెట్టామన్నారు. శుక్రవారం పెద్దమ్మ స్టేజీ వద్ద పట్టుకున్నామని, గాందారికి చెందిన మరో నేరస్తుడు మ్యాతరి సాయిలు పరారీలో ఉన్నాడని చెప్పారు. నిందితులు గతంలో బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడగా, వారి నుంచి లక్షా 50 వేలు, 72 బ్యాటరీలు, దొంగతనానికి ఉపయోగించిన కారును, టాటా ఏసీ ఆటోను అక్కడి పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వీరు కామారెడ్డి జిల్లాలో 10 కేసుల్లో నిందితులని, ఇప్పటి వరకు పాల్పడిన దొంగతనాలను ఒప్పుకున్నారని వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్సై రాంమోహన్, సిబ్బంది ఉన్నారు.

భూకబ్జా కేసు.. నిందితులకు రెండోసారి పోలీసు కస్టడీ

- కార్పొరేటర్ భర్తపై సీఎం ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, జనవరి 26: భూకబ్జా, దౌర్జన్యం, బెదిరింపుల కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న 12వ డివిజన్ కార్పొరేటర్ తోట రాములు, బీఆర్ఎస్ నాయకుడు చీటి రామారావులను కస్టడీకి ఇవ్వాలంటూ కరీంనగర్ కోర్టులో పోలీసులు పిటిషన్ సమర్పించగా 24 గంటల పోలీసు కస్టడీకి ఇస్తూ గురువారం సాయంత్రం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తోట రాములు, చీటి రామారావులను శుక్రవారం ఉదయం పోలీసులు కస్టడీకి తీసుకుని ఠాణాకు తరలించారు. అక్కడే రోజంతా విచారణ జరిపినట్లు తెలిసింది. ఒకే వ్యక్తి పేరిట 170 వరకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ డాక్యుమెంట్లు ఎవరైనా పెద్దలకు సంబంధించి బినామీగా ఆ వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయా అనే కోణంలో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. భారీసంఖ్యలో డాక్యుమెంట్లు లభించటంతో దీనిని ఆదాయపన్నుశాఖ అధికారులకు కూడా పంపించనున్నట్లు తెలుస్తోంది. కాగా పోలీసు కస్టడీలో ఉన్న ఇద్దరిని శనివారం ఉదయం జైలుకు తరలించనున్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రేకుర్తిలో కొందరు భూకబ్జాలకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ దుర్గం మనోహర్ అనే వ్యక్తి శుక్రవారం హైదరాబాద్ సీఎం దర్బార్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్థానిక ఎస్సారెస్పీ భూమిలో ఒక ఉపాధ్యాయుడు భవనం నిర్మించుకోగా అతనికి కొందరు ప్రభుత్వ అధికారులు సహకరించారని తెలిపారు. ఒక కార్పొరేటర్ భర్త స్థానిక ప్రభుత్వ భూమిని కొంత కబ్జా చేశాడని, ఆయనకు మరో అధికారి సహకరించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మరికొందరు కూడా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వీటన్నింటిపై విచారణకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

● ఎమ్మెల్సీ కవితపై జీవన్‌రెడి ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, జనవరి 26: మరొకరిపై ఆరోపణలు చేసే ముందు కేసుకు సంబంధించిన పూర్తి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ కవితపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో జీవన్ రెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగిత్యాలలో పర్యటించిన కవిత వాస్తవాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తూ మాట్లాడాన్ని పూర్తిగా తప్పుబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రాజ్యామా... ఖాకీల రాజ్యమా అని ఇష్టం వచ్చినట్లు కవిత మాట్లాడాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నాన్నారు. జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామంలో మూడు నెలల క్రితం జరిగిన సంఘటనలో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడగా మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముగ్గురు వ్యక్తులతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. పోలీసుల నిర్లక్ష్యంతో కేవలం ముగ్గురు వ్యక్తులను మాత్రమే అరెస్టు చేసి సర్పంచ్ పారిపోయినట్లు కోర్టుకు నివేదిక ఇచ్చారన్నారు. సర్పంచ్ మాత్రం గ్రామంలోనే ఉంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పటికి పోలీసులు అరెస్టు చేయలేదన్నారు. ఇదేనా బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవలంబించిన ఫ్రెండ్లీ పోలీస్ విధానం అని కవితను ప్రశ్నించారు. మూడు నెలల అనంతరం సర్పంచ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కక్ష పూరిత వ్యవహారం ఏముందని ప్రశ్నించారు. పార్టీ కార్యకర్త జైలుకు వెళితే పరామర్శించడం నాయకులుకు సహజమే అయినప్పటికి, హబ్సీపూర్ ఘటనలో చేతికి అందిన కుమారుడు బలవన్మరానికి పాల్పడితే ఆ తల్లి గుండె ఎంత విలవిల్లాండిదో అని ఎందుకు ఆ తల్లిని కవిత పరిమార్శించలేదన్నారు. జాగృతి అనే గొప్ప స్వచ్ఛంద సంస్థకు అధ్యక్షురాలుగా, మహిళగా, తల్లిగా నీకు పరామర్శించే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. రాజకీయ కోణంలో ఆలోచించవద్దని మానవీయ కోణంలో ఆలోచించాలని కవితకు హితవు పలికారు. హబ్సీపూర్ ఘటనలో పోలీసులు విచారణ వేగవంతం చేస్తే అసలు ఆ యువకుడు బలవన్మరణానికి పాల్పడేవాడే కాదన్నారు. దీనికి పోలీసులు పూర్తి బాధ్యత వహించాలని, ఈ కేసుపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతూ జిల్లా ఎస్పీకి ప్రత్యేక లేఖను రాయనున్నట్లు ఎమ్మెల్సీ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, యాదాద్రి పవర్ ప్లాంట్ ఇలా ఎన్నో అవినీతిలను వెలక్కితీసి మాట్లాడడం తప్పా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే బీఆర్ఎస్ నాయకులకు ఇంత ఉలిక్కిపడడం దేనికేనన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తాయన్నారు. 2014కు పూర్వం బీఆర్ఎస్ నాయకుల స్థితి గతులు ఎలా ఉన్నాయి.. ఇప్పుడు ఎలా ఉన్నాయి.. ఈ ఆర్థిక సంపద ఎలా వచ్చాయో అన్ని బయటకు వస్తాయన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, ముస్కు దామోదర్ రెడ్డి, గాజెంగి నందయ్య, జున్ను రాజేందర్, శీలం సురేందర్, చాంద్ పాష, రాధాకిషన్ రావు, విజయలక్ష్మి, అనిత, సరిత, రమణ, బండ శంకర్, గాజుల రాజేందర్, తురగ రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా ప్రతాలు



ప్రశంసా పత్రాలు అందుకున్న తహసీల్దార్లతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



అదనపు కలెక్టర్ అరుణశ్రీ | పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్ | మంథని ఆర్డీవో హనుమనాయక్ | జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి | డీఏవో ఆదిరెడ్డి | డీడబ్ల్యూవో రవూఫ్‌ఖాన్ | డీటీ ప్రవీణ్ కుమార్ | సీసీ సురేందర్



డీఆర్‌డీవో శ్రీధర్ | జడ్పీ సీఈవో శ్రీనివాస్ | డీసీవో శ్రీమాల | డీపీవో చంద్రమౌళి | డీపీఆర్‌వో అయూబ్ | డీఎండబ్ల్యూవో మీర్జామహమ్మద్ | సీసీ ఆకాష్ | మంథని ఏవో రవీందర్



ఏడీ శ్రీనివాసులు | డీఎఫ్‌వో శివయ్య | పశుసంవర్ధక శాఖాధికారి రవీందర్‌రెడ్డి | పౌరసరఫరాల శాఖ డీఎం శ్రీకాంత్‌రెడ్డి | పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్ | గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాసరావు | జిల్లా ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు | ఏవో శ్రీనివాస్ | కలెక్టరేట్ సూపరింటెండెంట్ ప్రకాష్ | కలెక్టరేట్ సూపరింటెండెంట్ సునీత | కలెక్టరేట్ సూపరింటెండెంట్ పుష్పలీల | కలెక్టరేట్ సూపరింటెండెంట్ రమాదేవి

ఘనంగా గణతంత్ర దినోత్సవం



పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయంలో గౌరవ వందనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు



గోదావరిఖనిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



జిల్లా పరిషత్ కార్యాలయంలో..

పెద్దపల్లి కల్చరల్, జనవరి 26 : గణతంత్ర వేడుకలు జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆర్డీవో కార్యాలయంతోపాటు పలుచోట్ల ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరణతో పాటు గౌరవ వందనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో మధుమోహన్‌తోపాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో, పలువార్డుల్లో చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక జాతీయ జండాను ఎగురవేశారు. జడ్పీ సీఈవోతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ జాతీయ జండాను ఎగురవేశారు. సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం జాతీయజెండాను ఎగురవేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ట్రినిటి విద్యాసంస్థల్లో వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, గాయత్రీ విద్యాసంస్థల్లో చైర్మన్ శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగురవేశారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 26: మండలంలోని పలు గ్రామాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో రాజు, ఎంపీపీ బండారి స్రవంతి-శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల, జనవరి 26 : మండలంలోని 22 గ్రామాల్లో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో సత్తయ్య జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అలాగే పలు కార్యాలయాల్లో, విద్యా సంస్థల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

సుల్తానాబాద్, జనవరి 26 : సుల్తానాబాద్ మున్సిపల్‌తోపాటు మండలంలో భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల జెండా ప్రభుత్వ , ప్రయివేట్ కార్యాలయాలతో పాటు వివిధ ముఖ్య కూడళ్లలో రెపరెపలాడింది. పోలీస్ స్టేషన్‌లో సీఐ జగదీష్ జెండాను ఆవిష్కరించగా, మున్సిపల్ కార్యాలయం ముందు ముఖ్య కూడలి వద్ద మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ జెండాను ఎగరవేశారు. పాత జెండా వద్ద మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమత కృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఎలిగేడు, జనవరి 26 : మండలంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, జడ్పీవైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుకరాజనర్సు, ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ స్వర్ణ జాతీయ జెండాను ఆవిష్కంచారు.

ధర్మారం, జనవరి26: మండలంలో శుక్రవారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జయశీల, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రజిత జాతీయ పతాకాలను ఎగరవేశారు. అదేవిదంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ పతాకాలను ఎగరవేశారు. పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవంను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రామగిరి, జనవరి 26: మండలంలోని గ్రామపంచాయతీల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. గ్రామపంచాయితీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన కార్యదర్శులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. సెంటినరీకాలనీలో ఐఎన్‌టీయుసీ, ఏఐటీయుసీ, టీబీజీకేఎస్, హెచ్‌ఎంఎస్, బిఎంఎస్, సీఐటీయు, తెలంగాణ ఉద్యామకారులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బిజెపి నాయకులు వివిధ కూడల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వీట్ల పంపిణీ కార్యక్రమాలను చేపట్టారు.

కమాన్‌పూర్, జనవరి 26 : మండలంలో గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వంగళ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, గ్రామపంచాయతీల్లో సర్పంచులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

మంథని, జనవరి 26: మంథనిలో గణతంత్ర వేడుకలను వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు శుక్రవారం జరుపుకున్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గుట్టల మల్లిఖార్జునస్వామి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, జడ్పీటీసీ తగరం సుమలత శంకర్‌లాల్, ఎంపీపీ కొండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 26: గణతంత్ర్య దినోత్సవాన్ని శుక్రవారం కాలనీ వాసులు ఘనంగా జరుపుకున్నారు. టౌటూన్‌పోలీస్‌స్టేషన్‌లో సీఐ వేణుగోపాల్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్ యానియన్ల కార్యాలయాల్లో నాయకులు జాతీయ జెండాలను ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో వేడుకలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చౌరస్తాలో జాతీయ జెండా ఆవిష్కరించారు. టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి పెద్దపెల్లి సత్యనారాయణ జాతీయ జండా ఎగురవేశారు.

పాలకుర్తి, జనవరి 26: మండల ప్రజా పరిషత్ కార్యలయం ఆవరణలో ఎంపీడీవో గంగాల లలిత, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతి, కేశోరాం సిమెంటు కంపెని ఆవరణలో కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య, పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి జాతీయ జెండాలను ఎగురవేశారు. పలు ప్రభుత్వప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

జూలపల్లి, జనవరి 25 : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోను శుక్రవారం గణతంత్ర వేడుకలను ప్రజలు, ప్రభుత్వ అధికారులు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను ఎగురవేసి వందనం చేశారు. తహసీల్దార్ బషీరుద్దిన్, ఎంపీపీ రమాదేవి, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జనవరి 26: మండలంలోని గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాంమోహనచారి, తహసీల్దార్ కార్యాలయంతో తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంఈవో కార్యాలయంలో ఎంపీపీ నూనేటి సంపత్ జాతీయ జెండాలను ఎగురవేసి వేడుకలను నిర్వహించారు. ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీషఅనీల్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్వతంత్రసమరయోధుడు ఎర్రబాటి రాజేశ్వర్‌ను తహసీల్దార్ జాహెద్‌పాషా సన్మానించారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, జనవరి 26: గోదావరిఖని చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ముఖ్యఅతిథిగా హాజరై జెండావిష్కరణ చేశారు. కార్పొరేటర్లు పాముకుంట్ల భాస్కర్, కొమ్ము వేణు, ఐత శివకుమార్, జడ్పీటీసీ ఆముల నారాయణ, నాయకులు మురళీధర్‌రావు, గోపు ఐలయ్య, తోడేటి శంకర్, జాహెద్‌పాషా, మెతుకు దేవరాజ్, చెలుకలపెల్లి శ్రీను, గుంపుల ఓదెలు, దొమ్మేటి వాసు, కోడి రామకృష్ణ, సంధ్య, సట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు. గోదావరిఖని చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. కందుల సంధ్యారాణి జెండావిష్కరణ చేశారు. బల్మూరి అమరేందర్‌రావు, వనిత, యాదగిరి సత్తయ్య, గాండ్ల ధర్మపురి, కోమళ్ల మహేష్, జక్కుల నరహరి, గోపగోని నవీన్, మచ్చ విశ్వాస్, గాండ్ల స్వరూప పాల్గొన్నారు. జవహర్‌నగర్ శిశుమందిర్‌లో సోమారపు లావణ్య జెండావిష్కరణ చేశారు. సోమారపు అరుణ్‌కుమార్, గంధం రవీందర్, జనార్ధన్, సత్యనారాయణ పాల్గొన్నారు. టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గోదావరిఖని చౌరస్తాలో టీడీపీ రామగుండం ఇన్‌చార్జి పెద్దపల్లి సత్యనారాయణ, భాస్కర్‌రావు భవన్‌లో సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు జెండావిష్కరణ చేశారు.

కోల్‌సిటీటౌన్, జనవరి 26: గణతంత్ర వేడుకల సందర్భంగా అడ్డగుంటపల్లి కృష్ణవేణి విద్యాసంస్థలో డైరెక్టర్ మంజులా శ్రీనివాస్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యూనివర్సిటీ పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమాకాంత్ జాతీయ జెండాను ఎగురవేశారు.



మంథని ఆర్డీవో కార్యాలయంలో



మంథని మున్సిపల్ కార్యాలయంలో..



బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో..

గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్, జనవరి 26: మండల వెన్నంపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, పాఠశాలలోని భోజనశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెన్నంపల్లి నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, సర్పంచ్ కాసం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ జెట్టి దేవన్న, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ పాల్గొన్నారు.

గర్రెపల్లిలో..

సుల్తానాబాద్, జనవరి 26: మండలంలోని గర్రెపల్లిలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ వీరగోని సుజాతరమేష్ ప్రారంభించారు. ఎంపీటీసీ పులి అనూష, సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, వైస్‌చైర్మన్ దీకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 26: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని ఎంపీపీ నూనేటి సంపత్ అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాల్వశ్రీరాంపూర్, మల్యాలలో ఆటలు వాడిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, సర్పంచ్ ఆడెపు శ్రీదేవిరాజు, లంక రాజేశ్వరిసదయ్య, ప్రధానోపాధ్యాయులు సునీత, సత్యలక్ష్మి పాల్గొన్నారు. మల్యాల ఉన్నత పాఠశాలలో వట్టపెల్లి శ్రీనివాస్‌మంజు దంపతులు బహుమతులు ప్రదానం చేశారు.

బీజేపీ ఎంపీ టికెట్ ఇవ్వాలి

గోదావరిఖని, జనవరి 26: ధార్మిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పని చేస్తూ 30ఏళ్లుగా హిందు ఏకీకరణకు విశేష కృషి చేస్తున్న వీహెచ్‌పీ నాయకుడు అయోధ్య రవీందర్‌కు పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ టికెట్ కేటాయించాలని పలువురు సూచించారు. శుక్రవారం స్థానిక ఒక ఫంక్షన్‌హాల్‌లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పలువురు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం..

కళ్యాణ్‌నగర్, జనవరి 26: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం జనగామలోని గోదావరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ ముగింపు పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. కార్పొరేటర్ జనగామ కవితసరోజిని, నాయకులు తోకల రమేష్, అచ్చె వేణు, జితేందర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపల్లి రూరల్, జనవరి 26 : పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్‌లో సగర సంఘం రాష్ట్ర కోశాధికారి కుమార్ స్వామి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షులు కనుకుల మొండయ్య, జిల్లా అధ్యక్షులు మార్కు లక్ష్మణ్, కనుకుల కొమురయ్య, సదయ్య, తాడిశెట్టి కనకయ్య, కడిపత్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దపల్లిలో భారత రాజ్యాంగ రథయాత్ర

పెద్దపల్లి కల్చరల్, జనవరి 26 : ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి నుండి కమాన్, జండా, మజీద్, బండారి కుంట అంబేద్కర్ విగ్రహం నుండి పెద్దపల్లి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. గణేష్, న్యాతారి శ్రీనివాస్, శంకరయ్య, కృష్ణ, రవిందర్, రమేష్, సతీష్, శివ. అమిజుద్దిన్, స్రవంతి, రమ్య, సౌందర్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

సుల్తానాబాద్, జనవరి 26: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా శుక్రవారం తెలంగాణ ఆర్టిసీ ఎండి సజ్జనార్ హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. బిరుదు రాజమల్లు ఆరోగ్యపరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాజమల్లు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అవార్డును అందుకున్న విద్యార్థికి సన్మానం

రామగిరి, జనవరి 26: తెలంగాణ ఇన్నోవేషన్ సెల్, గ్రామీణ పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలు సంయుక్తంగా నిర్వహించిన విలేజ్ ఇన్నోవేషన్ అవార్డుకు మండలంలోని పన్నూరు గ్రామానికి చెందిన వాణి పాఠశాల విద్యార్థి విక్రం ఎంపికయ్యారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అల్లంపద్మ విద్యార్థిని సత్కరించి మెమొంటోను అందజేశారు. జడ్‌పీటీసీ మ్యాదరవేని శారద, వైస్‌ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ నిర్వాహకులకు సన్మానం..

కమాన్‌పూర్, జనవరి 26: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధిస్తున్న విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్ దంపతులను శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సన్మానించారు.

ప్రధాన దేవాలయాలను అభివృద్ధి చేయాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ఓదెల, జనవరి 26 : జిల్లాల్లో ప్రధాన ఆలయాలు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆకాంక్షించారు. మండల కేం ద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి కొప్పుల ఈశ్వర్ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, ఈవో వారిద్దరిని సన్మానించారు. అనంతరం కొప్పుల ఈశ్వర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో, రాష్ట్రంలో ఆలయాలపై భక్తులకు అత్యంత విశ్వాసం ఉందని అందుకనుగుణంగా తెలంగాణలో కేసీఆర్ ప్రత్యేకత చూపి యాదాద్రి, వేములవాడ, కాళేశ్వరం, రాములవారి ఆలయాలపై శ్రద్ధ చూపి ఆద ర్శవంతంగా అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వ మే నేరుగా ప్రత్యేకనిధులు కేటాయించిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఆలయాలను అభివృద్ధి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మేకల మల్లేశం,ఎంపీపీ రేణుక దేవి, జడ్పిటిసి గంట రాములు,సభ్యులు కనిక రెడ్డి సతీష్,బత్తుల రమేష్, మ్యాడగొని శ్రీకాంత్, కర్రె కుమారస్వామి,ఆరెల్లి మొండయ్య చింతం మొగిలి,దాసరి రాజయ్య, అలాగే టీఆర్ఎస్ నాయకులు కర్క మల్లారెడ్డి,రమణారెడ్డి, పోలంపెల్లి బుచ్చిరెడ్డి,పిట్టల అరుణ్, బోడకుంట నరేష్,మాజీ డైరెక్టర్ బుద్దే కుమారస్వామి, ఉప సర్పంచ్ తీర్థాల కుమారస్వామి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, పోలోజు రమేష్,రాచర్ల కుమార్, తోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలి

సమష్టి కృషితోనే సింగరేణి అభివృద్ధి
బొగ్గు ఉత్పత్తి కోసం శ్రమించండి
గణతంత్ర వేడుకల్లో ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్







ఆర్జీ-1, ఆర్జీ-2, ఆర్జీ-3 ఏరియాల్లో జెండా వందనం చేస్తున్న జీఎంలు, అధికారులు, యూనియన్ నాయకులు

గోదావరిఖని, జనవరి 26: ప్రతిఒక్కరూ దేశ భక్తిని కలిగి ఉండాలని, భారతీయులంతా ఐకమత్యంగా కలిసి మెలిసి ఉండాలని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జీఎం కార్యాలయంలో, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన వేడుకలకు జీఎం ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, జాతి భేదాలు లేకుండా భారతీయులంతా ఒకటే అనే సిద్ధాంతం తో ముందుకు సాగాలన్నారు. మన దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ప్రతి భారతీయుడు దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని సూచించారు. దేశంలో బొగ్గు రంగ సంస్థల్లో సింగరేణి సంస్థ దూసుకుపోతుందని, ప్రతి కార్మికుడు సంస్థ తనదనే భావనతో లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. బొగ్గు ఉత్పత్తి ఈ రెండు నెలలు ఎంతో కీలకమైందని, బొగ్గు ఉత్పత్తి వెలికి తీయడంతో ఉద్యోగులు, అధికారులు సమిష్టి కృషితో పని చేయాలని, ప్రతి ఉద్యోగి అంకిత భావంతో కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించవచ్చునన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేస్తూ దేశానికి వెలుగులు ప్రసాదించాలని ఆయన సూచించారు. అనంతరం ఉత్తమ కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సేఫ్టీ జీఎం సాంబయ్య, కేవీరావు, ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోషం, మడ్డి ఎల్లయ్య, ఎస్ఓటూ జీఎం రాం మోహన్, లక్ష్మీనారాయణ, అంజనేయులు, కిరణ్‌రాజ్‌కుమార్, ధనలక్ష్మి, మదన్మోహన్, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, నాగేశ్వర్, నరేన్‌చక్రవర్తి, సీనియర్ పీవో బంగారు సారంగపాణి, శ్రావణ్‌కుమార్, వసంతకుమార్ పాల్గొన్నారు.

● **గనులపై రెపరెపలాడిన మువ్వన్నెల జెండా..**

ఆర్జీ-1లోని గనులు, డిపార్ట్‌మెంట్లపై గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోదావరిఖని గాంధీనగర్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టెముక్కుల నారాయణచారి, మాదాసు రవీందర్, ఆంజనేయులు, వెంకటస్వామి, ఆకుల హరిణ్, లక్ష్మయ్య, గట్టయ్య, శ్రీనివాస్, భాస్కర్, సాయవేని సతీష్ పాల్గొన్నారు. సీఐటీయూ కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజిరెడ్డి జెండావిష్కరణ చేశారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియాలో గణతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. జీఎం కార్యాలయంలో జీఎం సూర్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సేవా భవన్‌లో ఏరియా సేవా అధ్యక్షురాలు మాలతి సూర్యనారాయణ జండా ఎగురవేశారు. అబ్దుల్ కలాం స్టేడియంలో జరిగిన ప్రధాన గణతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జీఎం సూర్యనారాయణ జాతీయ జండాని ఎగురవేసి ఎస్అండ్‌పీసీ, పాఠశాల విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఉత్తమ కార్మికులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. దేశ పారిశ్రామిక అభివృద్ధిలో సింగరేణి కీలకభూమిక పోషిస్తున్నదని, రాష్ట్ర విద్యుత్ అవసరాలకు సరిపడా బొగ్గును సరఫరా చేయడం మన బాధ్యత అని అన్నారు. ఈఏడాది ఏరియాకు కేటాయించిన బొగ్గు లక్షాన్ని సాధించేలా ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాలని జీఎం పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు మాలతి సూర్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, అధికారుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్, వీకేపీ గ్రూప్ ఏజంట్ శ్రీనివాసరెడ్డి, ఎస్వోటూ జీఎం అబ్దుల్‌సలీంతో పాటు వివిధ గనులు, విభాగాల అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రామగిరి: తెలంగాణకు సింగరేణి పరిశ్రమ మణిహారంగా ఉందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని స్థానిక రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోనే పెద్దపరిశ్రమగా సింగరేణి విరాజిల్లుతోందన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా సమష్టిగా ఉత్పత్తిని సాధించుకోవాలన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తితో పాటుగా సోలార్ ఉత్పత్తిని సైతం జనరేట్ చేస్తోందని పేర్కొన్నారు. నిర్ధేశిత లక్ష్యాలను సమష్టిగా సాధించుకొని దేశ అభ్యున్నతికి పాటు పడాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ అధికారులకు, కార్మికులుగా ఎంపికైన వారికి అభినందనలు తెలుపుతూ శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. విజిలెన్స్ వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఎస్అండ్‌పీసీ, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల కవాతును స్వీకరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

కార్యక్రమంలో ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ట్రేడ్‌యూనియన్ నాయకులు వైవీ రావు, ఎంఆర్‌సీ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు కొట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు రాధకృష్ణ, సేవా అధ్యక్షురాలు అలివేణి, విజయలక్ష్మి, ముప్పిడి రవీందర్‌రెడ్డి, వివిధ విభాగలకు చెందిన అదికారులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలోని గనులు, ప్రాజెక్టులపై అధికారుల జెండాలను ఆవిష్కరించారు.